

పరదేశీ కథలు

- చిట్టి సిద్ధ లలిత



- 139 -

త్యాగం

కువైట్‌లోని జాబ్రియా ప్రాంతంలో ఉన్న ఆ విల్లా ఒక ఆధునిక రాజభవనం. ఇటాలియన్ మార్బుల్ ఫ్లోరింగ్, అంచుల వెంట బంగారు పూత పూసిన అద్దాలు, పైకప్పు నుండి సొగసుగా వేలాడుతూ రాత్రిపూట ఇంద్రధనస్సులను మరిపించే షాండ్లియర్స్ ప్రత్యేకంగా కనబడుతుంటాయి. కానీ, ఆ ఇంట్లోని వాతావరణం మాత్రం ఎప్పుడూ గంభీరంగా, కఠినంగా ఉంటుంది. దానికి కారణం ఆ ఇంటి యజమానురాలు షరీఫా..!

వజ్రాల హారాలు, ఖరీదైన పట్టు అబాయాలు (గౌన్లు) ధరించే షరీఫా కళ్లలో కేవలం అహంకారం మాత్రమే కనిపిస్తుంది. ఆమె ముందు పనివాళ్ళు భయంతో వణికిపోతుంటారు.

కొత్తగా వచ్చిన అమ్ములు కూడా సేటాని కనబడితే చాలు భయపడుతోంది. కారణం అమ్ములు వచ్చీ రాగానే "నువ్వు క్రిస్టియన్ వా? హిందువువా? హిందువులు కాఫిర్లు. వారికి నా ఇంట్లో చోటు లేదు. నిజం చెప్పు" అని గద్దించింది.

వీజా తీసిన ఏజెంట్ ముందే అమ్ములుకు చెప్పాడు. నువ్వు "క్రిస్టియన్: అని చెప్పు, లేకపోతే కువైట్ వాళ్ళు ఇండియాకు పంపించేస్తారు" అని భయపెట్టాడు.

"అష్టకష్టాలు పడి ఇంతదూరం వచ్చాక ఇంటికి తిరిగిపోవడమా..!" హడలి పోయింది అమ్ములు.

ఆరోజు షరీఫా హాల్లో కూర్చుని వుండగా అమ్ములు మోకాళ్లపై వంగి, తడి గుడ్డతో ఆ తెల్లటి మార్బుల్ నేలను అద్దంలా తుడుస్తోంది.

కాస్త అలిసిపోయిన అమ్ములు ఒక్క క్షణం ఆగి నుదిటిపై చమట తుడుచుకుందో లేదో... "ఖల్లాస్ (చాలు)" అంటూ షరీఫా గొంతు హాల్లో కంచులా మ్రోగింది. తన ఐఫోన్ స్క్రీన్ నుండి కళ్లు తిప్పకుండానే, "నువ్వు తుడిచిన చోటల్లా నీ దేశపు మురికి వాసన వస్తోంది. నా బానిసవు నువ్వు. నేను చెప్పినట్లు పని సరిగ్గా చెయ్యి, లేదంటే ఈ నెల జీతం కట్ చేస్తా" అరిచింది షరీఫా.

అమ్ములు కళ్లు చెమ్మగిల్లాయి. కందిన అరచేతులను దాచుకుంటూ, కన్నీటి చుక్క కింద పడకుండా ఆపుకుంటూ, వంగి పని చేయసాగింది. ఆమెకు తెలుసు... తిరుపతిలో చదువుకుంటున్న తన చిన్న కూతురి ఫీజు, పెద్ద కూతురి పెళ్లి అప్పు తీరాలంటే ఈ ఈసడింపులను దిగమింగక తప్పదని..!

ఆ రోజు కువైట్ వాతావరణం భీతి గొలిపేలా ఉంది. బయట షమాల్ అనబడే భయంకరమైన ఎడారి ఇసుక తుఫాను రేగింది. బలంగా కిటికీ అద్దాలను తాకుతూ ఇసుక రేణువులు గట్టి శబ్దం చేస్తున్నాయి. ఆకాశం పచ్చటి, ఎర్రటి రంగుల కలయికతో చీకటిగా మారిపోయింది. ఇంట్లో ఎవరూ లేరు, సుల్తాన్ ఆఫీస్ పని మీద దుబాయ్ వెళ్లారు.

హాల్లో ఒంటరిగా కూర్చున్న షరీఫా ముఖం అకస్మాత్తుగా తెల్లగా అయిపోయింది. ఆమె ఊపిరి పీల్చుకోవడానికి గాలి కోసం నోరు తెరిచింది, కానీ గొంతులో ఏదో అడ్డుపడినట్టు అయింది. ఆమె చేతులు వణకసాగాయి. పక్కనే ఉన్న గ్లాసును అందుకోబోతే అది కింద పడి ముక్కలైంది.

కిచెన్ లో ఉన్న అమ్ములు ఆ గాజు ముక్కల శబ్దానికి పరుగున వచ్చింది. హాల్ సోఫాలో షరీఫా ముఖం నీలంగా మారిపోతూ, కళ్లు పైకి తేలేస్తూ కాళ్ళుచేతులు కొట్టుకోవడం చూసి అమ్ములు గుండె ఆగినంత పనైంది. అమ్ములు భయంతో వణుకుతూనే షరీఫాను పట్టుకుంది.

"మామా... మామా..." అని పిలిచింది, కానీ షరీఫా అప్పటికే స్పృహను కోల్పోయింది. కిడ్నీలు పూర్తిగా విఫలమై, శరీరంలో టాక్సిన్లు ఎక్కువవడంతో వచ్చిన తీవ్రమైన మెడికల్ ఎమర్జెన్సీ అది. బయట తుఫాను బీభత్సం సృష్టిస్తుంటే, లోపల షరీఫా ప్రాణం గాల్లో దీపమైంది.

వెంటనే అమ్ములు బయట వున్న డ్రైవర్ ను కేకేసింది. డ్రైవర్ సాయంతో షరీఫాను కారులో కూర్చోవెట్టి సకాలంలో హాస్పిటల్ కు చేర్చారు.

రెండు రోజుల తర్వాత... అల్ అమిరి ఆసుపత్రిలోని ఐసీయూ వెలుపల ఉత్కంఠ నెలకొంది. ఐసీయూ లోపల తెల్లటి బెడ్‌పై, రకరకాల పైపులు, మానిటర్ల మధ్య షరీఫా ప్రాణాలతో కొట్టుమిట్టాడుతోంది. బయట ఏసీల చల్లదనంలో కూడా సుల్తాన్, ఆయన పిల్లలు చెమటలు గక్కుతున్నారు.

బ్రిటిష్ డాక్టర్ బయటకు వచ్చి గంభీరంగా చెప్పాడు. ఆమె రెండు కిడ్నీలు పూర్తిగా పాడైపోయాయి. టాక్సిన్లు గుండెపై ప్రభావం చూపిస్తున్నాయి. అత్యవసరంగా కిడ్నీ మార్పిడి జరగాలి. కొన్ని గంటలు మాత్రమే సమయం వుంది. ఈ లోపల దాత దొరకకపోతే ఆవిడను కాపాడలేం.

భార్య ప్రాణం పోతుందని భయపడిన సుల్తాన్ తనకున్న పలుకుబడితో కువైట్ లోని ప్రతి మెడికల్ నెట్‌వర్క్‌ను కదిలించాడు. డబ్బులు ఎంతైనా ఇస్తామన్నాడు. కానీ, విధి ఎంత విచిత్రమైనదంటే విల్లా యజమానురాలి కుటుంబ సభ్యులెవరి కిడ్నీ కూడా షరీఫా బ్లడ్ గ్రూప్, టిష్యూతో మ్యాచ్ కాలేదు.

అంత పెద్ద కోటీశ్వరుడు దిక్కుతోచక అక్కడే ఆ ఆసుపత్రి గోడకు తల బాదుకుంటూ ఏడ్చాడు. అధికారం, అహంకారం, కోట్లాది రూపాయల ఆస్తి... ఏదీ ఆ క్షణాన ఒక కిడ్నీని కొనలేకపోయాయి.

ఆసుపత్రి మూలన, ఒక పాత కుర్చీలో ముడుచుకుని కూర్చుని ఉంది అమ్ములు. రోజంతా తిట్టి, తిండి కూడా సరిగ్గా పెట్టకుండా ఈసడించుకున్న కఠినమైన యజమానురాలి పరిస్థితి చూసి ఆమె కళ్లలో నీళ్లు తిరిగాయి. అమ్ములు మనసులో ఒక సుడిగుండం రేగింది. తన గ్రామంలో, తన భర్త కూడా ఇలాగే సరైన వైద్యం అందక చనిపోయాడు. ఆ చావు దెబ్బ ఎలా ఉంటుందో అమ్ములుకు తెలుసు. అభంశుభం ఎరుగని షరీఫా పిల్లల ఏడుపు ఆమెను కదిలించింది. అమ్ములు మెల్లగా లేచి, వణుకుతున్న అడుగులతో సుల్తాన్ ముందుకు వెళ్ళింది.

తల వంచుకుని, వచ్చీరాని అరబిక్ భాషలో "బాబా... నేను ఇస్తాను... నా కిడ్నీ మా సేటానికి ఇస్తాను. ఒకసారి డాక్టర్‌తో పరీక్షలు చేయించండి." ఆ మాట వినగానే అక్కడ ఒక్కసారిగా నిశ్శబ్దం ఆవరించింది. సుల్తాన్ నమ్మలేనట్టు అమ్ములు వైపు చూశాడు. రోజూ కుక్క కన్నా హీనంగా చూసిన ఒక పరాయి దేశపు మహిళ, తమ ప్రాణం కాపాడటానికి తన శరీర భాగాన్ని ఇవ్వడానికి సిద్ధపడటమా?! సుల్తాన్ కళ్లలో అపరాధ భావం, ఆశ ఒకేసారి మెరిశాయి.

వెంటనే డాక్టర్లు అమ్ములును ల్యాబ్‌కు తీసుకెళ్లారు. సూదులు గుచ్చుతుంటే అమ్ములు కళ్లు మూసుకుని తన పిల్లలను తలుచుకుంది. ఆసుపత్రి కారిడార్‌లో టెన్షన్ గరిష్ట స్థాయికి చేరింది. మానిటర్ల టిక్ టిక్ శబ్దాలు గుండె చప్పుళ్లను పెంచుతున్నాయి.

రెండు గంటల తర్వాత డాక్టర్ చేతిలో రిపోర్టుతో పరుగెత్తుకుంటూ వచ్చాడు. ఆయన ముఖంలో అద్భుతం చూసిన ఆనందం ఉంది.

"ఇది ఒక అద్భుతం, సొంత బంధువులకు కూడా కుదరని మ్యాచ్, ఈమెతో వంద శాతం సరిపోయింది! పర్ఫెక్ట్ మ్యాచ్. వెంటనే ఆపరేషన్ థియేటర్ సిద్ధం చేయండి" అని అరిచాడు. ఈ విషయం ఐసీయూలో స్పృహలోకి వచ్చిన షరీఫాకు తెలిసింది. డయాలసిస్ పైపుల మధ్య నుండి ఆమె కళ్లు అమ్ములు కోసం వెతికాయి. అమ్ములును లోపలికి తెచ్చినప్పుడు, షరీఫా గొంతులో నుండి మాట రాలేదు, కేవలం కన్నీళ్లు మాత్రమే ముఖంపై నుండి కారి ఆక్సిజన్ మాస్క్‌ను తడిపాయి. ఆ కన్నీళ్లలో అహంకారం కొట్టుకుపోయింది.

ఆ రాత్రి ఆపరేషన్ థియేటర్ లోపల టెన్షన్ పీక్స్‌కు చేరింది. పచ్చటి సర్జికల్ లైట్ల కింద రెండు బెడ్‌లు పక్కపక్కనే ఉన్నాయి. ఒకదానిపై కువైట్ సేటాని షరీఫా, ఇంకోదానిపై భారతీయ పనిమనిషి అమ్ములు నిస్తేజంగా పడుకుని వున్నారు. ఇద్దరి శరీరాలపై తెల్లటి బట్టలు కప్పబడి వున్నాయి. ఇద్దరిలోకి అనస్థీషియా మందులు ఎక్కుతున్నాయి. డాక్టర్లు అమ్ములు శరీరం నుండి జాగ్రత్తగా ఒక కిడ్నీని వేరు చేశారు.

ఆ చిన్న మాంసపు ముక్క, ఇప్పుడు ఒక కోటీశ్వరురాలి ప్రాణాన్ని నిలబెట్టబోతోంది. ఐదు గంటల సుదీర్ఘ శస్త్రచికిత్స అది... బయట సుల్తాన్ ప్రార్థనలు చేస్తున్నాడు.

చివరకు సర్జన్ బయటకు వచ్చి థంబ్స్ అప్ చూపించాడు. ఆపరేషన్ సక్సెస్! అమ్ములు ఇచ్చిన కిడ్నీ షరీఫా శరీరంలో విజయవంతంగా అమరింది, ఆమె గుండె మళ్లీ నార్మల్ స్పీడ్‌తో కొట్టుకోవడం ప్రారంభించింది. రెండు వేర్వేరు దేశాలు, రెండు వేర్వేరు సంస్కృతులు... కానీ ఆరోజు ఒకే రక్తం, ఒకే ప్రాణ బంధంతో ముడిపడిపోయాయి.

🦋🦋🦋

వారం రోజుల తర్వాత... హాస్పిటల్ స్పెషల్ రూమ్ లోని షరీఫా ఇప్పుడు పూర్తిగా కోలుకుంది. పక్కనే చైర్‌లో కూర్చుని ఉంది అమ్ములు. షరీఫా మెల్లగా బెడ్ పైనుంచి దిగింది. నడుస్తున్నప్పుడు కొద్దిగా నొప్పి ఉన్నా లెక్కచేయకుండా అమ్ములు ముందుకు వెళ్ళింది.

ఆ కువైట్ సేటాని, మోకాళ్లపై వంగి, అమ్ములు చేతులను తన రెండు చేతుల్లోకి తీసుకుంది. ఒకప్పుడు ఏ చేతులనైతే మురికి అని ఈసడించుకుందో, బానిస అని హేళన చేసిందో, కాఫిర్ వా అని ప్రశ్నించిందో అదే చేతులను తన కళ్లకు అద్దుకుంది.

"నన్ను క్షమించు అమ్ములు... నా శరీరంలో ఇప్పుడు నీ రక్తం ప్రవహిస్తోంది, నీ ప్రాణం కొట్టుకుంటోంది. నేను ఎంత అంధురాలినో, అవివేకినో ఈరోజు తెలిసింది. డబ్బుతో కొనలేని ప్రాణాన్ని నీ మానవత్వంతో నాకు భిక్షగా ఇచ్చావు," అంటూ ఏడ్చేసింది.

సేటు కూడా అమ్ములుకు కృతజ్ఞతలు చెప్పి దేశాలు, మతాలు, భాషలు వేరయినా... డబ్బున్నా లేకపోయినా... మనిషిలో మానవత్వం వుండాలని నిరూపించావమ్మా... అంటూ నమస్కరించాడు.

ఆ క్షణం పరిసరాలన్నీ నిశ్శబ్దంగా ఆ ఇద్దరి బంధాన్ని చూస్తూ ఉండిపోయాయి. సేటు కూడా సంతోషభరితుడై అమ్ములు కుటుంబానికి రాజంపేటలో ఒక అద్భుతమైన ఇల్లు కట్టించి, ఆమె ఇద్దరు కూతుళ్లకు సరిపడా బంగారాన్ని, జీవితాంతం కూర్చుని తినేంత డబ్బును ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశాడు. కానీ అన్నింటికంటే మిన్నగా,

అమ్ములుకు ఆ ఇంట్లో పనిమనిషి అన్న పదం శాశ్వతంగా తుడిచిపెట్టుకుపోయింది. ఆమె ఇప్పుడు ఆ ఇంటికి ప్రాణదాత, షరీఫాకు సొంత సోదరి. అహంకారపు ఎడారిలో మానవత్వపు ఒయాసిస్ వికసించింది.

(మరోకథ వచ్చేనెల)

Post your comments